క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


వేంకటేశ్వరస్వామి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం, మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారు లో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వా మి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే కౌతాళంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధికంగా తరలి వచ్చి స్వామి ని దర్శించుకున్నారు.

కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: విధి నిర్వహణలో మృతి చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కర్స్ అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మునీంద్ర, సీఐటీయూ నాయకుడు రాముడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 21వ తేదీ నుంచి చేపట్టనున్న సమ్మెలో కార్మికులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఆదోని సెంట్రల్: పట్టణం నుంచి ఎమ్మిగనూ రు మీదుగా ఎర్రకోట ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే విద్యార్థులకు విద్యార్థి బస్సు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ రఫిని కలసి వినతిప త్రం సమర్పించారు. పట్టణం నుంచి దాదాపు 150 నుంచి 200 మంది దాకా విద్యార్థులు కళాశాలకు వెళ్తుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, శశిధర్, నరసింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎర్రకోట ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుధాకర్, రిసోర్స్ పర్సన్ హర్షిత్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఈ శిక్షణ చాల ఉపయోగపడుతుందని తెలిపారు.

గోనెగండ్లకు చేరిన ఎల్లెల్సీ నీరు



గోనెగండ్ల: తుంగభద్ర దిగువ కాలువ నీరు గోనెగండ్ల సెక్షన్‌కు శనివారం ఉదయం చేరుకున్నాయి. ఇరిగేషన్ ఇన్‌చార్జ్ ఏఈ పరమేష్ మాట్లాడుతూ గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు దాదాపు 186 క్యూసెక్కుల నీరు వస్తుంది. తాగునీటి అవసరాలు, వ్యవసాయం కోసం నీటిని వదిలినట్లు తెలిపారు. తాగునీటి అవసరాల కోసం మండలంలోని గోనెగండ్ల, అలువాల ఎస్ఎస్ ట్యాంకులు, నీటి కుంటలను ఎల్లెల్సీ నీటితో నింపుతున్నట్లు వెల్లడించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఆదోని అర్బన్: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. శనివారం ఆదోని పట్టణంలోని శ్రీనివాసభవన్ వెనక ఉన్న ప్రభాకర్ టాకీసు వద్ద రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ తదితర వాటిని దగ్గర ఉంచుకోవాలన్నారు.

ప్లాస్టిక్‌తో అనర్థాలే ఎక్కువ


ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ప్లాస్టిక్‌తో అనర్థాలే ఎక్కువ అని, అందు వలన ప్లాస్టిక్ వినియోగించవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

నందవరం : సోమలగూడూరు గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కేశవ, పోలీసు సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్లాస్టిక్ రహిత సమాజం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. జంతుశాస్త్ర అధ్యాపకులు డా. రంగనాథం ప్లాస్టిక్ రోటరీ క్లబ్ అధ్యక్షులు డా. టి ఎండి సైఫుల్లా, క్లబ్ సభ్యులు భరత్‌షా, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు జోహాథన్, విక్లిఫ్ వెంకట్ రామిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న బుట్టా రేణుక, పార్టీ శ్రేణులు, సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక పిలుపు
- హామీలు నెరవేర్చకుండా ప్రజలను దగా చేస్తున్న చంద్రబాబు
- ఎక్కడా కానరాని అభివృద్ధి, సంక్షేమం
- బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్ ఆవిష్కరణ

గోనెగండ్ల: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతగా దగా చేశారో ప్రజలకు వివరిద్దామని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక పిలుపు నిచ్చారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని బాషా పంక్షన్ హాలులో మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బుట్టా రేణుక మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన మోసపూరిత హామీలను, వైఎస్సార్‌సీపీ పాలనలో జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాల వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని నెరవేర్చకుండా మోసగించాడని, తమకు చేసిందేమీ లేదని ప్రజలు బాహాటంగానే మండిపడుతున్నారన్నారు. ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులను విస్మరించడం చంద్రబాబు నైజమన్నారు. తల్లికి వందనం పథకంలో చదువుకునే ప్రతి విద్యార్థికి ఇస్తామని చెప్పి షరతులు పెట్టి ఎగ్గొట్టి విద్యార్థుల తల్లులను మోసం చేశారని ఆరోపించారు. త్వరలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తామని, గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి బాబు మోసాలను వివరించాలన్నారు

ఆడపడుచులు, నిరుద్యోగులను మోసం చేసిన బాబు

ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అని ఊదరగొట్టిన బాబు వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. ఆడబిడ్డ నిధి వంటి పథకాలు ఇస్తామని ప్రగల్బాలు పలికారని గుర్తు చేశారు. పొదుపు మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు భృతి ఇస్తామని మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏటా రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం అందజేస్తామని చెప్పినప్పటికీ నేటికి అమలు చేయలేదని, ఆ పథకం అమలుపై పాలకుల్లో స్పష్టత కొరవడిందన్నారు.

నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు

కూటమి పాలనలో ఆ పార్టీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష కట్టి దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు రోజు రోజుకు మితిమిరిపోతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు.

బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొలాల్లో ఉచిత బోర్లు

బుట్టా ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో బోర్ బండిని ఏర్పాటు చేసి ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ ఆధ్వర్యంలో రైతుల వ్యవసాయ భూముల్లో ఉచితంగా బోర్లను వేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు శివ నీలకంఠ, అలువాల ప్రమోద్ కుమార్ రెడ్డి, కాశీరెడ్డి, నాగేష్ నాయుడు, బందెనవాజ్, వెంకట్రామిరెడ్డి, రవూఫ్, మురళి నాయుడు, దొరబాబు, అల్లబకాష్, చికెన్ రాజా, ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, రంగా రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తోలు రాముడు, మల్లికార్జున రెడ్డి, మోహన్ రెడ్డి, పద్మనాభం, నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పని చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ సూచించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలిగా నియామకమైన లతారెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడిగా నియామకమైన శ్రీధర్‌రెడ్డిలు వారిని శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

నందవరం/ఎమ్మిగనూరు టౌన్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి సతీమణి గొల్ల ఆనందమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, సీనియర్ నాయకులు శివ నీలకంఠ, రాష్ట్ర యువజన విభాగపు అధ్యక్షుడు బుట్టా ప్రతుల్ శనివారం విరూపాక్షిరెడ్డిని, ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని నింపారు.

చంద్రబాబు మోసాలను ఎండగడుదాం


బాబు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వై ప్రదీప్ రెడ్డి

- జగన్ 2.0తో ప్రతి కార్యకర్త భరోసా
- పార్టీ ఫిరాయింపులను ఉపేక్షించేది లేదు
- వేధింపులకు కార్యకర్తలు భయపడవద్దు..అండగా ఉంటాం
- వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

కోసిగి: చంద్రబాబు మోసాలు ఎండగడదామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం స్థానిక సిద్దరూఢ స్వామి ఆలయ ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు 45 ఏళ్ల రాజకీయం చేసినా నాటి నుంచి నేటి వరకు అడ్డదారిలో ప్రజలకు అబద్దాల హామీలు, పొత్తులతో అధికారంలోకి రావడమే తప్పా, నేరుగా ఒంటరిగా పోరాడి గెలుపొందిన దాఖలాలు లేవవని విమర్శించారు. వైఎస్సార్ సీపీ వ్యవస్థాపకులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి ఒంటరిగా పార్టీ స్థాపించి ప్రజల మద్దతులో ముఖ్యమంత్రిగా గెలుపొందారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామిలకు మాట తప్పకుండా పార్టీలకు, కులమతాలకు అతీతంగా కరోనా కష్టాలలో సైతం లెక్కచేయకుండా సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

కూటమి సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాలని వై. ప్రదీప్‌రెడ్డి అన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు మోసాలను ప్రజలకు చూపించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలే లక్ష్యంగా పెట్టుకుని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వేధింపులకు కార్యకర్తలు భయపడవద్దని, రాంపురం రెడ్డి కుటుంబం అండగా ఉంటుందన్నారు. జగన్ 2.0 తో కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ వేధింపులకు గురి చేసిన వారికి త్వరలోనే తిరిగి చెల్లిద్దామన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారి ఉపేక్షించేది లేదన్నారు. వారికి తగిన గుణపాఠం చెబుదామన్నారు. అనంతరం చంద్రబాబు మోసాల చూపించే క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, నాడుగేని నరసింహులు, పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఐరన్‌గల్లు శ్రీనివాస రెడ్డి, దళవాయి మంగమ్మ, నాడుగేని భీమక్క, నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి, యల్లయ్య, బుళ్లి నరసింహులు, బండ్ల గోవిందు, జగదీష్ స్వామి, ముకుంద కృష్ణమూర్తి, కాంట్రాక్ట్ నాగరాజు, ప్రతాప్, షౌకత్ అలీ, అంజి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడవద్దు.. అండగా ఉంటాం

మండల కేంద్రం కోసిగిలోని రంగప్ప గట్టు వద్ద నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త, వలంటీర్ గ్యాలం వెంకటేష్‌కు చెందిన దుకాణాన్ని ఇటీవల కూటమి నాయకులు ధ్వంసం చేశారు. శనివారం కోసిగికు వచ్చిన వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి వలంటీర్ వెంకటేష్, ఆయన చెల్లెళ్లను పరామర్శించారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయంలో వలంటీర్‌గా సేవలందించారు. ఆ తర్వాత ఇంటి వద్ద దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రదీప్‌రెడ్డి వలంటీర్‌కు రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు.

వర్షంలో విద్యార్థులు.. ఆటోలో ఇంటికి తరలించిన ఎస్ఐ


ఆటోలో విద్యార్థులను ఎక్కిస్తున్న ఎస్ఐ రామ్‌నాథ్

ఆదోని అర్బన్: వర్షంలో చిక్కుకున్న విద్యార్థులను టూటౌన్ ఎస్ఐ రామ్‌నాథ్ ఆటోలో ఎక్కించి వారివారి ఇళ్లకు తరలించారు. మూడో శనివారం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల ఒంటిపూట ఉండడంతో మధ్యాహ్నమే వదిలేశారు. ప్రతిరోజు సాయంత్రం పాఠశాల వదలగానే విద్యార్థులంతా టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద బస్సుకోసం వేచిచూసే వారు. శనివారం పాఠశాల మధ్యాహ్నమే వదలడం, ఆ రూట్‌లో బస్సు ఉదయం, సాయంత్రం మాత్రమే ఉండటంతో విద్యార్థులు రోజూ మాదిరిగా స్టేషన్ ముందు బస్సు కోసం వేచి ఉన్నారు. అయితే వర్షం రావడంతో విద్యార్థులు తడిసిపోయారు. గమనించిన ఎస్ఐ రామ్‌నాథ్ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి విద్యార్థుల కోసం బస్సు పంపాలని కోరగా.. ఉదయం, సాయంత్రం మాత్రమే వస్తుంది, ఇప్పుడు రాదు అని చెప్పడంతో.. ఆ రోడ్డులో వెళ్తున్న ట్రాలీ, ప్యాసింజర్ ఆటోలను ఆపి విద్యార్థులను వారివారి ఇళ్లకు తరలించారు.

వరద కాలువ నిర్మించండి

కౌతాళం: తుంగభద్ర నదికి వరద కాలువ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆనంద బాబు డిమాండ్ చేశారు. మంత్రాలయం నియోజకవర్గ సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. మండల కన్వీనర్ ఈరన్న అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆనందబాబు, సీనియర్ నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ ఈ ఏడాది ముందుగా వర్షాలు రావడంతో ప్రాజెక్టులన్నీ నిండి జూలై నెలలోనే డ్యాముల నుంచి నదులకు నీళ్లు వదులుతున్నారన్నారు. ఇప్పటి నుంచి నవంబర్ వరకు వర్షాలు వచ్చినా ఆ వరదనీరు 80నుంచి వంద టీఎంసీలు వృథాగా సముద్రం పాలవుతున్నాయన్నారు. ఈ నీటిని మనం ఉపయోగించుకుంటే కర్నూలు పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శులు తిక్కన్న, రాముడు, నాయకులు నాగిరెడ్డి, వీరేష్, చిన్న మారయ్య, ఉలిగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న అత్యాచారాలు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్ అన్నారు. కారంచేడు హత్యాకాండ జరిగి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం పట్టణంలో దళిత అమర వీరుల సంస్మరణ సభను నిర్వహించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి దేవేంద్ర, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి మణి, జిల్లా కమిటీ సభ్యుడు రాజులతో కలిసి అమరులకు నివాళులర్పించారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, వీరేష్, నాగరాజు, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మకుమార్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఈనెల 18న ఆంజనేయులుకు ఛాతీలో నొప్పితో ప్రభుత్వ ఆసుపత్రికి రాగా, వైద్య సిబ్బందితో ప్రథమ చికిత్స చేసినట్లు తెలిపారు. సరైన సమయంలో వైద్యం అందక అతను మృతిచెందాడన్నారు. డ్యూటీలో ఉన్నప్పటికీ రోగికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉండేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటి నుంచే తపాలా సేవలు

ఆదోని అర్బన్/ఎమ్మిగనూరుటౌన్: అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ సేవలు 2.0తో అనేక రకాల సేవలు ఇంట్లో సెల్‌ఫోన్‌లోనే పొందవచ్చని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీసర్ శ్రీధర్, ఎమ్మిగనూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వై.నాగరాజు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. ఆదోని హెడ్‌పోస్టు ఆఫీసు పరిధిలో 198, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలోని దాదాపు 90 పోస్టాఫీసుల్లో ఈనెల 22వ తేదీన ఏపీటీ 2.0 సేవలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ఈనెల 21వ తేదీన హెడ్‌పోస్టు ఆఫీసు, బ్రాంచి పోస్టాఫీసుల పరిధిలో సేవలు తాత్కాలిక సేవలు నిలిపివేయడం జరుగుతుందన్నారు.

బదిలీ ప్రిన్సిపాల్‌కు సన్మానం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో పనిచేసి వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ సమీరా రెడ్డిని క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయ బృందం సన్మానించారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం బాలికల పాఠశాల హెచ్ఎం పరిమళ దేవి, పీడీ ఖలీల్ అహ్మద్, సీనియర్ ప్రైమరి స్కూల్ హెచ్ఎం రాజమౌళి సమక్షంలో ఆమెకు సన్మానం చేశారు.

శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు


నూతన కళ్యాణకట్ట పనులు పరిశీలిస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు జరిగే శ్రావణమాస ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. శనివారం తుంగభద్ర దిగువ కాలువ వద్ద నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ కట్టను పరిశీలించారు. అలాగే వాహనాల పార్కింగ్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం తదితర ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించారు. ఆయన వెంట ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ముఖ్య అర్చకుడు నాగరాజ్‌స్వామి, దేవాలయం సిబ్బంది ఉన్నారు.

నేడు 'బాబు ష్యూరీటీ- మోసం గ్యారెంటీ'

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రం మంత్రాలయంలో ఆదివారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ సీవీ విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ..ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్య కల్యాణ మండపం (హెచ్‌ఆర్‌బీ కల్యాణ మండపం పక్కన)లో కార్యక్రమం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు వై. సీతారామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తూముకు నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామ సమీపంలో ఎల్ఎల్‌సీ కాలువ తూము నుంచి శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ చెరువుకు నీటిని పెద్దహరివాణం గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మెడికల్ నాగరాజు, లక్ష్మమ్మవ్వ చెరువు ప్రెసిడెంట్ బోయ హుసేనప్ప విడుదల చేశారు. ముందుగా గంగమ్మ తల్లికి పూజలు చేసి తూము ద్వారా నీటిని దిగువకు వదిలారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో ఈ తూము ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా నీటిని నేరుగా శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ చెరువుకు చేరుకోవడంతో పాటు చుట్టుపక్కన ఉన్న వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతులు ఉప్పర్ వీరేష్, ఇరవడి నాగప్ప, వడ్డే రమేష్, కుప్పలదొడ్డి మల్లప్ప, సూరి తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకట్టను తొలగించాలి

ఆదోని రూరల్: మండలంలోని చిన్న హరివాణం గ్రామంలో వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంగా వేసిన కట్టను తక్షణమే తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, రైతుసంఘం మండల కార్యదర్శి ఎల్లప్ప, బీకేఎంయూ మండల అధ్యక్షుడు కొత్తూరు గంగన్న, చిన్నహరివాణం గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు శనివారం సబ్‌కలెక్టర్, తహసీల్దార్‌లకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా 200 ఎకరాల పొలాల నుంచి వచ్చే వర్షపునీరు, గ్రామం నుంచి వెళ్లే డ్రైనేజీ నీరు, పిల్ల కాలువ నీరు వంకలోకి వెళ్లే చోట అడ్డుకట్ట వేయడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి గ్రామంలోకి వస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి అడ్డుకట్ట తొలగించాలని కోరారు. కరెంట్ ఈరన్న, శేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం


రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపు నీరు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో మధ్యాహ్నం కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో అయా కాలనీలు జలమయమయ్యాయి. ప్రధానంగా శ్రీనివాస భవన్ కూడలి దగ్గర రోషన్ లాడ్జ్ ముందు వరకు, ఓవర్ బ్రిడ్జి కింద రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం ఆవరణలో నీరు నిల్వ ఉన్నాయి. వరదలను తలపించే విధంగా నీరు పోటెత్తడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో మురుగు కాలువలలోని నీరంతా రహదారులపైకి చేరాయి. మురుగు కాలువలు ఆక్రమణలకు గురై కుంచించుకుపోవడం, విస్తరణ చేపట్టకపోవడం వల్లే మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

పేదల స్థలాలపై కన్ను


తొలగించిన హెచ్చరిక బోర్డు

పెద్దకడబూరు: గత కొన్ని సంవత్సరాలుగా వివాదంలో ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును టీడీపీ నాయకుల అండదండలతో కొందరు తొలగించేశారు. మండల కేంద్రంలోని కురువ కాలనీలో సర్వేనెంబర్ 258 (గ్రామ కంఠం)లో 14సెంట్ల భూమి ఉంది. గతంలో ఆ స్థలంలో మరుగుదొడ్డి ఉండేది. 2009 – 10లో ఓపెన్ మరుగుదొడ్లను నిషేధించడంతో అప్పటి గ్రామ సర్పంచ్ శివన్న దానిని తొలగించారు. ఆ స్థలాన్ని అప్పటి తహసీల్దార్ కొందరికి ప్లాట్లు కేటాయించారు. నాటి నుంచి స్థానిక టీడీపీ నాయకుల కన్ను ఆ స్థలంపై పడింది. ఏదో రకంగా ఆ స్థలాన్ని పేదలకు దక్కకుండా చేయాలని కుట్రలు పన్నారు. బాధితులు వారి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కోర్టుకు వెళ్లారు. గొడవలు ఎక్కువ అవ్వడంతో ఆ స్థలంలో అప్పటి తహసీల్దారు, ఎస్ఐలు 145 సెక్షన్‌ను అమలు చేశారు. అలాగే కోర్టు నుంచి బాధితులు గుడిసెలు వేసుకునేందుకు అనుమతులు రాగా.. అక్కడ గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు కాలనీ వాసులు టీడీపీ నాయకుల ప్రోద్బలంతో గుడిసెలను, బండలను ధ్వంసం చేసి సామాన్లు బయట పడేశారు. ఈ విషయంపై బాధితులు ప్రస్తుత తహసీల్దారు గీతా ప్రియదర్శిని కలసి వివరాలు చెప్పడంతో స్పందించిన ఆమె 18-7-2025న (శుక్రవారం) ఆ స్థలంలో ఇది ప్రభుత్వ స్థలం అని బోర్డును ఏర్పాటు చేశారు. అయితే టీడీపీ నాయకుల సహాయంతో శనివారం కొందరు ఆ బోర్డును తొలగించారు. తహసీల్దారు స్పందించి బోర్డును తొలగించిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరి నరసింహులు, కృష్ణ తదితరులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చాలని నిరసన


రోడ్లపై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని రూరల్: రోడ్లపై పడిన గుంతలను పూడ్చాలని పెద్దహరివాణం గ్రామ సర్పంచ్ రాము, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మెడికల్ నాగరాజు, కుప్పలదొడ్డి గర్జప్ప, బి.పి.వీరేష్, డాబా మల్లిరెడ్డి, బజారప్ప, మధు, బరికి మల్లయ్య తదితరులు డిమాండ్ చేశారు. శనివారం వారు రోడ్లపై నిలిచిన గుంతల్లో వరి నాట్లు వేసి నిరసన తెలియజేశారు. ఆదోని-సిరుగుప్ప, పెద్ద హరివాణం-హెబ్బటం రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయని, అయినా అధికారులు గుంతలను పూడ్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు మరలింగప్ప, బి.పి.బలరాం, మీసేవ నాగరాజు, కుప్పలదొడ్డి మల్ల ప్ప, డాబా చంద్ర, బండి తిమ్మప్ప, మదిరె సర్పంచ్ నారాయణ, మాలింగ, సున్నుసాబ్ తదితరులు పాల్గొన్నారు.